## క్లుప్తంగా

### రైతులకు అందుబాటులో ఉండండి



ఏడీ వెంకట మధుకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏఈవోలు

నరసన్నపేట: ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమవ్వడంతో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని వ్యవసాయ శాఖ ఏడీ వెంకట మధు సూచించారు. వీఏఏలుగా ఉన్నవారిలో ఆరుగురికి ఈ డివిజన్‌లో ప్రభుత్వం ఏఈవోలుగా పదోన్నతి కల్పించింది. దీంతో వీరందరూ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వారు ఏడీని కలిశారు. కార్యక్రమంలో ఏఈవోలుగా పదోన్నతి పొందిన డి. సాయిప్రసన్న కుమార్, టి.శ్రీనివాసరావు, జి.ప్రసాద్, కె.భాను ప్రకాశ్, కె.సురేష్‌లు పాల్గొన్నారు.

### కేజీబీవీ సందర్శన



కేజీబీవీ పరిశీలిస్తున్న ఏపీసీ శశిభూషణ్

హిరమండలం: మండల కేంద్రంలోని కేజీబీవీని సర్వశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శశిభూషణ్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థినులకు క్రమశిక్షణతో విద్యనందించి బంగారు భవితకు బాటలు వేయాలని సూచించారు. అనంతరం విద్యాలయం నిర్వహణకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. అలాగే వంటగది, భోజనశాలలను పరిశీలించారు. నూతనంగా అడ్మిషన్లు పొందిన విద్యార్థినులతో ముచ్చటించారు. ఒకేషనల్ ట్రైనర్ ఫుడ్ ప్రాసెసింగ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఆయనతో పాటు ఎస్‌వో ఎస్.కృష్ణవేణి ఉన్నారు.

### సమస్యలను పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు

పొందూరు: స్థానిక రైల్వేస్టేషన్‌లో సమస్యలను త్వరగా పరిష్కరించాలని రైల్వేశాఖ చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణకు రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు శనివారం వినతిపత్రం అందించారు. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌ను నిలుపుదల చేయాలని, పాసింజర్ వెయిటింగ్ హాల్‌ను ఏర్పాటు చేయాలని, లైదాం గేటు వద్ద ఓవర్ బ్రిడ్జి పనులు చేపట్టాలని కోరారు. వినతి పత్రం అందించినవారిలో కమిటీ సభ్యులు కిల్లి శ్రీరామ్మూర్తి, బలివాడ సత్యనారాయణ, పేరురు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

### రథాన్ని ఢీకొన్న బస్సు



బస్సు వద్ద గ్రామస్తుల ఆందోళన

బూర్జ: మండలంలోని బూర్జ గ్రామంలో శుక్రవారం జగన్నాథ స్వామి రథయాత్ర పూర్తి చేసిన తర్వాత గ్రామస్తుల సహకారంతో అర్ధరాత్రి రథాన్ని గ్రామ చివరలో ఉంచారు. అయితే శనివారం ఉదయం పాలకొండ నుంచి వచ్చిన స్టూడెంట్స్ బస్సు బూర్జ గ్రామంలో రథాన్ని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రథం చక్రాలు విరిగి కొంత మేరకు నష్టం వాటిల్లింది. సుమారు రూ.15 లక్షలు ఖర్చు పెట్టి, రెండు సంవత్సరాలు రథం నిర్మాణం చేపడితే బస్సు డైవర్ నిర్లక్ష్యంగా నడిపారని స్థానికులు ఆగ్రహంతో బస్సు నిలుపుదల చేసి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పరామర్శ



మొఖలింగం కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బూర్జ: మండలంలోని సింగన్నపాలేం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు గేదెల మొఖలింగం ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ పీఏసీ మెంబర్ తమ్మినేని సీతారాం, ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్‌లు శనివారం పరామర్శించారు. అలాగే కొరగాం గ్రామంలో ఇటీవల మృతి చెందిన బెవర సూర్యారావు కుటుంబాన్ని తమ్మినేని సీతారాం కలిసి మృతికి కారణాలు తెలుసుకున్నారు. అదే విధంగా తోటవాడ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గుడిసె దాలయ్య కుటుంబాన్ని రవికుమార్ పరామర్శించారు. వారితో పాటు జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, మాజీ ఏఎంసీ చైర్మన్, మామిడివలస ఎంపీటీసీ గుమ్మడి రాంబాబు, తోటవాడ సర్పంచ్ సూర బానందరావు, వైస్ సర్పంచ్ జి.వెంకటరావు తదితరులు ఉన్నారు.

# జ్వరభద్రం



సారవకోట ప్రధాన వీధిలో పూడికలతో నిండిన మురుగునీటి కాలువ

| నరసన్నపేట నియోజకవర్గంలో పంచాయతీలు | |
|---|---|
| మండలం | పంచాయతీలు |
| సారవకోట | 35 |
| జలుమూరు | 41 |
| పోలాకి | 31 |
| నరసన్నపేట | 34 |



బుడితి సచివాలయం సమీపంలో మురుగు నీరు

- గ్రామాల్లో కనిపించని పారిశుద్ధ్యం
- పంచాయతీల్లో నిధుల లేమి
- ఆందోళన చెందుతున్న ప్రజలు

సారవకోట: వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు, ఇటీవల కురుస్తున్న వర్షాలు కారణంగా వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. అయితే జూన్ నుంచి ఆగస్టు వరకు వ్యాధులు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉన్నా, ప్రస్తుతం గ్రామాల్లో పారిశుద్ధ్యం అంతంతమాత్రంగానే కన్పిస్తోంది. ప్రభుత్వం ప్రతీనెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర పేరుతో కార్యక్రమం నిర్వహిస్తుందే తప్ప దానితో ఎటువంటి ఉపయోగం ఉండడం లేదు. గ్రామాల్లో మురుగునీటి కాలువలు ఎక్కడికక్కడే పూడికలతో నిండి పోయాయి. పారిశుద్ధ్య పనులు, బావుల్లో క్లోరినేషన్ చేయించేందుకు పంచాయతీల ఖజానా ఖాళీగా ఉండడంతో పాలకవర్గాలు ముందడుగు వేసేందుకు అవకాశం లేకుండా పోతోంది. వర్షాలు ప్రారంభమైతే దోమలు, ఈగలు మరింత విజృంభించే అవకాశం ఉంది. దోమల నివారణకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతీ సచివాలయానికి ఒక్కొక్క ఫాగింగ్ యంత్రం అందించగా, వాటిని చాలా సచివాలయాల పరిధిలో వినియోగించే దాఖలాలు లేకుండా పోయాయి. ఆ యంత్రాలు వినియోగించేందుకు అవసరమైన నిధులు సైతం పంచాయతీల్లో ప్రస్తుతం లేకపోవడంతో మూలకు చేరుతున్నాయి. మరోవైపు గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరించి వాటిని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించే ప్రయత్నం చేస్తున్నారే తప్ప, ఆ చెత్తను రీసైక్లింగ్ చేసేందుకు చర్యలు తీసుకోకపోవడంతో గ్రామాల్లో రోడ్లకిరువైపులా చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి.

### పూడికలు తొలగించాలి



రానున్న వ్యాధుల కాలాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లోని మురుగునీటి కాలువలో పేరుకుపోయిన పూడికలు తొలగించాలి. పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు చర్యలు సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకుంటే వ్యాధులు ప్రబలకుండా చూడవచ్చు. – లోకొండ సింహాచలం, దాసుపురం, సారవకోట మండలం

### చర్యలు తీసుకుంటున్నాం



గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. చెత్త సేకరణ బండ్లతో గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తున్నాం. ప్రజలు కాచి చల్లార్చిన నీరు, వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలి. – ప్రభాకరరావు, డిప్యూటీ ఎంపీడీవో, సారవకోట

### అవగాహన



ఇంటింటా చెత్త సేకరణపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఈవోపీఆర్డీ డి.గోవిందరావు సూచించారు. హిరమండలం మండలంలోని గులుమూరు గ్రామంలో పొడి చెత్త, తడి చెత్త సేకరణతో పాటు ఐవీఆర్ఎస్ కాల్స్‌పై గ్రామస్తులకు శనివారం చైతన్యపరిచారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎస్.కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మంగమ్మ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాజు తదితరులు ఉన్నారు. – హిరమండలం

### తవ్వారు.. వదిలేశారు



సారవకోట మండలంలోని గొర్రిబంద పంచాయతీ జగన్నాథపురం గిరిజన గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ కుళాయిల కోసం పైపులైన్లు వేశారు. పైపులైన్లు వేసేందుకు యంత్రాలతో రోడ్ల తవ్వకం చేపట్టారు. దీంతో రోడ్డుకు పక్కనున్న మురుగు నీటి కాలువలు, రోడ్డు పాడైపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని రోడ్డుపైనే మట్టి వదిలేయడంతో ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – సారవకోట

## ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు పెరగాలి



నివగాంలో విద్యార్థుల హాజరు పుస్తకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కొత్తూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెంచాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉపాధ్యాయులకు సూచించారు. కొత్తూరు మండలం నివగాం జెడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. గత ఏడాది కంటే ఈసారి ఆరో తరగతిలో ప్రవేశాలు తక్కువ ఉండటాన్ని గమనించి హెచ్‌ఎం రాఘవదాసును ప్రశ్నించారు. ఈ ఏడాది సమీపంలో ఉన్న బలద, మాకవరం పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయడం వల్ల ప్రవేశాలు తగ్గినట్లు హెచ్‌ఎం వివరించారు. కలెక్టర్‌తో పాటు టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి ఉన్నారు.

## శక్తి యాప్‌తో మహిళలకు భద్రత



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నరసన్నపేట: మహిళల భద్రతకు శక్తి యాప్ సహకరిస్తుందని, ప్రతీ మహిళ తమ ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లత సూచించారు. కళాశాలలో విద్యార్థినులకు యాప్‌పై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్ ఉపయోగపడుతుందని సూచించారు. దీని వినియోగం కూడా చాలా సులభమని, సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు వచ్చి రక్షణ కల్పిస్తారని తెలియజేశారు. టెక్కలి డివిజన్ డబ్ల్యూపీసీ వి.సుహాసిని, హెడ్‌కానిస్టేబుల్ ఎం.గిరిధర్‌లు యాప్ వినియోగం, డౌన్‌లోడ్ గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవికుమార్, ఎస్.పరమేశ్వరరావు, ఎ.పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

### అన్నదానం



అన్నదాన కార్యక్రమం జరుగుతున్న దృశ్యం

కొత్తూరు: మండలంలో మహసింగి గ్రామంలోని వరాహ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి గోగులు వరప్రసాదరావు నాయుడు పుట్టినరోజు సందర్భంగా ఆయన ఆర్థిక సాయంతో అన్నదానం చేపట్టారు. అలాగే ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పాతపట్నం: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో ఈనెల 30వ తేదీన సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టెక్కలి విద్యుత్ శాఖ ఈఈ జి.శంకరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్డీఎస్ ప్రాజెక్టులో భాగంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొత్త చంగుడి, దశరథపురం, బైరాగిపేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## నట్టల నివారణ మందులు పంపిణీ



పశుగ్రాసం పంటను పరిశీలిస్తున్న ఏడీ నర్సింహులు

పాతపట్నం: టెక్కలి డివిజన్ పరిధిలోని 5.29 లక్షల జీవాలకు నట్టల నివారణ మందులు పంపిణీ లక్ష్యంగా నిర్ణయించామని పశుసంవర్ధశాఖ టెక్కలి డివిజన్ ఉప సంచాలకుడు డాక్టర్ సీహెచ్ నరసింహులు అన్నారు. మండలంలోని కోదూరు గ్రామంలో గొర్రెలు, మేకలకు నిర్వహిస్తున్న డీ–వార్మింగ్ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. టెక్కలి డివిజన్ పరిధిలో ఉన్న 16 మండలాల్లో మూగజీవాలకు జూలై 10వ తేదీ వరకు నట్టల నివారణ మందులు పశు వైద్య బృందాలు ద్వారా పంపిణీ చేయనున్నామన్నారు. ఈ అవకాశాన్ని గొర్రెల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మద్దుమర్రి గ్రామంలోని పశుగ్రాసం పెంపకాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు ఏడీ ఎం.కరుణాకరరావు, పశువైద్యులు డాక్టర్ పి.అనిల్ కుమార్, గుణాలమ్మ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

### ఆక్రమణలు తొలగించాలి

బూర్జ: మండలంలోని కేకే రాజపురం గ్రామంలో ఉన్న బద్ది చెరువు ఆక్రమణలు తొలగించాలని గ్రామానికి చెందిన మండల మాల మహానాడు అధ్యక్షుడు కంట కృష్ణారావు కోరారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సర్వే నంబర్ 72లో 57.29 సెంట్లు విస్తీర్ణం గల చెరువు గర్భాన్ని మట్టితో కప్పి కొందరు ఆక్రమణలు చేపడుతున్నారని, మరి కొందరు నిర్మాణాలు కూడా చేపడుతున్నారని తెలిపారు. దీని వలన చెరువు కుదించుకుపోయి, సామర్థ్యం కూడా తగ్గుతోందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## న్యాయవాదిని ఏర్పాటు చేస్తాం



ఖైదీలతో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి వాణి

నరసన్నపేట: సబ్ జైలులో ఉన్న రిమాండ్ ఖైదీల విజ్ఞప్తి మేరకు వారికి ఉచితంగా న్యాయవాదిని కావాలంటే ఏర్పాటు చేస్తామని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్ ఎస్.వాణి అన్నారు. స్థానిక సబ్ జైలును శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. ఎవరెవరు ఏఏ కేసుల్లో అరెస్టయ్యారు.. ఎవరికైనా ఉచిత న్యాయవాది అవసరం ఉందా అని అడిగి తెలుసుకున్నారు. న్యాయవాది కావాలని విజ్ఞప్తి చేస్తే కల్పిస్తామని తెలిపారు. ఖైదీలకు పెట్టే ఆహార నాణ్యతను పరిశీలించారు. ఆరోగ్య పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆమెతో పాటు సబ్ జైలు సూపరింటెండెంట్ వినయ్, కోర్టు సిబ్బంది ఉన్నారు.

## సచివాలయాల ఉద్యోగులను బలి చేయొద్దు

పోలాకి: రాజకీయాల కోసం గ్రామ సచివాలయాల ఉద్యోగులను బలి చేయొద్దని పోలాకి మండల గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఘం శనివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం చేపడుతున్న బదిలీల్లో అనేక లొసుగులు ఉన్నాయన్నారు. కొందరికి అనుకూలంగా, మరికొందరికి ప్రతికూలంగా బదిలీలు జరుగుతున్న తీరును ఖండించారు. బదిలీలు పారదర్శకంగా జరిపించి, ర్యాంకుల ఆధారంగా, సీనియార్టీని పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మితిమీరిన రాజకీయ జోక్యంతో ఎలాంటి రాజకీయ అనుబంధం లేని సిబ్బందికి అవస్థలు తప్పడం లేదని పేర్కొన్నారు.

### విద్యతోనే ఉజ్వల భవిష్యత్



అదనపు భవనాలకు శంకుస్థాపన చేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తదితరులు

కొత్తూరు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. మండలంలో వసప గ్రామంలోని కేజీబీవీలో నిర్మించనున్న అదనపు భవనాలకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావుతో కలిసి శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అదనపు భవనాలు నిర్మించడం జరుగుతోందన్నారు. అనంతరం గ్రామ సచివాలయం ఉద్యోగులకు సొంత మండలాల్లో బదిలీలు చేయాలని వీఆర్వోలు, సర్వేయర్లు, ఇంజినీరింగ్ అధికారులు, మహిళ పోలీసులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆర్డీవో కృష్ణమూర్తి, తహసీల్దార్ బాలకృష్ణ, ఎంపీడీవో నీరజ, కేజీబీవీ ఎస్‌వో రాధిక తదితరులు పాల్గొన్నారు.

### ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



ఖైదీల యోగక్షేమాలను అడుగుతున్న జడ్జి వివేక్ ఆనంద్

పాతపట్నం: పాతపట్నం సబ్‌జైలులో ఉంటున్న ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని మూడో అదనపు జిల్లా జడ్జి వివేక్ ఆనంద్ అన్నారు. పాతపట్నం కోర్టు జడ్జి ఎం.రోషిణి, సబ్ జడ్జి శ్రీధర్‌తో కలిసి పాతపట్నం సబ్‌జైలును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి వివేక్ ఆనంద్ ఖైదీలతో మాట్లాడి వారికి అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. జైలు రికార్డులను పరిశీలించారు. వంట గదులు, స్టోర్ రూమ్‌లను తనిఖీ చేశారు. ఖైదీల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలంగా శిక్ష పడిన దోషులకు న్యాయవాదులు ఉన్నారా లేదా అన్న అంశంపై అక్కడి జైలు సూపరింటెండెంట్ ఎం.సన్యాసిరావును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వరి...జాగ్రత్తలు తప్పనిసరి..!

- యాజమాన్య పద్ధతులతో దిగుబడులు
- మెలకువల పాటిస్తే నాణ్యమైన పంట
- సూచనలు చేస్తున్న వ్యవసాయ నిపుణులు

| సాగు వివరాలు | | |
|---|---|---|
| మండలం | సాగు విస్తీర్ణం (హెక్టార్లలో) | రైతులు |
| ఆమదాలవలస | 5,028 | 10,522 |
| సరుబుజ్జిలి | 4,796 | 7,352 |
| పొందూరు | 2,622 | 12,759 |
| బూర్జ | 5,075 | 8,219 |



దమ్ము పడుతూ నారుమడులు సిద్ధం చేస్తున్న రైతులు

ఆమదాలవలస: పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఎరువులు, పురుగు మందుల వాడకంతో పాటు నీటి యాజమాన్యంలో మెలకువలు పాటిస్తే ఆరోగ్యవంతమైన, నాణ్యమైన పంట వస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ఆరంభం కావడంతో రైతులంతా పొలం పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే సాగు తొలినాళ్ల నుంచి జాగ్రత్త వహిస్తూ పంటలు పండించుకుంటే వ్యవసాయాన్ని లాభదాయకం చేసుకోవచ్చని చెబుతున్నారు. వరిపంట పండించేందుకు ఆమ్ల, క్షార, చౌడు నేలలు మినహా మిగతా అన్ని నేలలూ అనుకూలమే, దుబ్బ, కారు, చౌడు నేలలో పంటకు నీరు అధికంగా కావాల్సి ఉంటుంది. అలాంటి నేలల్లో వరి కాకుండా ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

### నారు మడి ఇలా ఉండాలి...

- నారుమడిలో రెండు క్వింటాళ్ల పశువుల ఎరువు లేదా వర్మీ కంపోస్ట్ వేసి రెండు, మూడుసార్లు బాగా దమ్ము చేసి చదును చేయాలి. సాధారణ పంట భూమి కన్నా నారుమడులను కొంచెం ఎత్తులో తయారు చేసుకోవాలి.
- ఐదు సెంట్ల నారుమడిలో ఒక కిలో నత్రజని, రెండు కిలోల భాస్వరం, కిలో పొటాష్ ఎరువును దుక్కిలో వేసుకోవాలి. విత్తనాలు విత్తిన 15 రోజుల తర్వాత మళ్లీ కిలో నత్రజని వేసుకోవాలి. నాట్లు ఆలస్యమయ్యే ప్రదేశాల్లో నారు ముదురు పోకుండా చూసుకోవాలి.
- విత్తనం చల్లిన తర్వాత మొక్క దశలో పలచగా నీరు ఉండాలి.
- మెట్ట నారుమడుల్లో ఇనుము దాతువు లోపం అత్యధికంగా కనిపిస్తోంది. దీని నివారణకు మొక్క ఎదుగుదలను అనుసరించి రెండు నుంచి ఐదు గ్రాముల అన్నబేధి, గ్రాము ఉప్పును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- జింక్ ధాతువు లోపం నివారణకు జింక్ సల్ఫేట్ 2 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- నాట్లు వేయడానికి ముందు నారు కొనలు తుంచి వేసుకుంటే కాండం తొలిచే పురుగును నివారించుకోవచ్చు
- నారును 0.02 శాతం క్లోరోపైరిపాస్ ద్రావణంలో నాలుగు గంటలు ముంచి వేసుకుంటే కాండం తొలిచే పురుగు, ఆకుమడత దోమను నివారించవచ్చు.
- మధ్యకాలిక రకాలను చదరపు మీటరుకు 44 కుదుళ్లు, స్వల్పకాలిక రకాలైతే 66 కుదుళ్లకు ఉండేలా చూడాలి. నారు బాగా ముదిరి ఆలస్యంగా నాటుకునేటప్పుడు కుదుళ్ల సంఖ్యను పెంచి కుదురుకు 6 నుంచి 8 మొక్కలు చొప్పున నాటు వేయాలి.
- సమగ్ర పోషక యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు ద్వారా నారు పెంచుకుంటే ప్రధాన పంట పొలంలో వచ్చే సమస్యలు అధిగమించవచ్చు.

### అవగాహన పెంచుకోవాలి



మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలి. విత్తనాల ఎంపిక దగ్గర నుంచి నారుమడి తయారీ, వెదజల్లే పద్ధతుల, నాట్లు వేసేకోవడం, పంట సంరక్షణ పద్ధతులు ఇలా అన్నింటిలోనూ చైతన్యం పొందాలి. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది సూచనలు పాటించాలి. – మెట్ట మోహన్‌రావు, వ్యవసాయ అధికారి, ఆమదాలవలస

### విత్తనాలు అరబెట్టుకోవాలి

ఆమదాలవలస నియోజకవర్గంలో రైతులు పలు రకాల విత్తనాలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. ఎకరానికి సరాసరిన 20 నుంచి 25 కిలోల విత్తనాలు నారు వేసేందుకు సరిపోతుంది. అయితే వాటిని విత్తుకునే ముందు కిలో విత్తనాలకు మూడు గ్రాముల కార్బండిజం కలిపి తడిపి ఆరబెట్టుకోవాలి. ఆ తర్వాత సిద్ధం చేసిన నారుమడిలో వేసుకోవాలి. జూలై 15వ తేదీ వరకు నారు పోసుకోవచ్చు. ఆగస్టు చివరి వరకు పొలంలో నాట్లు వేసుకోవచ్చు.

## కూర్మావతారంలో నల్లనయ్య



నరసన్నపేట: జగన్నాథస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

జగన్నాథ స్వామి రథోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా స్వామివారు రోజుకో రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. రెండో రోజైన శనివారం కూర్మావతారంలో పూజలు అందుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. – సాక్షి నెట్‌వర్క్



సారవకోట: కూర్మావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథస్వామి



హిరమండలం: ఎల్ఎన్‌పేటలో కూర్మావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు



హిరమండలం: మత్స్య, కూర్మావతారాల్లో దర్శనమిస్తున్న జగన్నాథుడు